## పెండింగ్ వేతనాలను చెల్లించాలని వినతి



బాన్సువాడలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆపరేటర్లు

బాన్సువాడ, సెప్టెంబర్ 27 : బాన్సువాడ డివిజన్‌లోని అన్ని మండల కేంద్రాల్లో ఉన్న తహసీల్ కార్యాలయాలో విధులు నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర ధరణి ఉగ్యోగుల సంఘం (ఆపరేటర్లు) శుక్రవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయిని కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. థర్డ్ పార్టీ ఏజెన్సీని రద్దు చేసి, ప్రభుత్వ ఖజనా(డీడీవో) ద్వారా తమ వేతనాలు చెల్లించాలని, తమకు పూర్తి న్యాయం చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను మంజూరు చేయించాలని కోరారు. ఈ నెల 29న నిర్వహించే తహసీల్దార్ల సమావేశంలో ప్రభుత్వానికి ధరణ ఆపరేటర్ల సమస్యలను విన్నవించాలని కోరారు. కార్యక్రమంలో ఆపరేటర్లు శ్రీధర్‌రెడ్డి, ఫిరోజ్, మధు, ప్రవీణ్, గజానంద్, రాజశేఖర్, హన్మంతు, రమేశ్ పాల్గొన్నారు.

**ఇండ్లకు హక్కు పత్రాలు ఇప్పించాలని వినతి**

బీర్కూర్ మండలం భైరాపూర్, మల్లాపూర్ గ్రామాలకు చెందిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించుకున్న తమకు హక్కు పత్రాలు ఇవ్వాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు స్వరూపా శ్రీనివాస్ ఆధ్వర్యంలో లబ్ధిదారులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. తమకు హక్కు పత్రాలను ఇప్పించాలని కోరారు.

**కళాశాల భవనంపై చర్యలు తీసుకోవాలని..**

బోర్లం రోడ్డులో ఉన్న కళాశాల భవనానికి అనుమతులు లేవని, భవనంపై విచారణ చేపట్టాలని బీజేపీ నాయకులు బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాయిరెడ్డి, శ్రీనివాస్, గంగారెడ్డి, ప్రసాద్, తదితరులు ఉన్నారు.

## కుల బహిష్కరణ చేసి.. భయభ్రాంతులకు గురిచేస్తున్నారు..

మాచారెడ్డి,సెప్టెంబర్ 27 : తమ కూతురు కులాంతర వివాహం చేసుకున్నదని తమను 2021లో కులబహిష్కరణ చేశారని మాచారెడ్డికి చెందిన బంగ్లా రాజేందర్‌గౌడ్ కుటుంబీకులు తెలిపారు. సంఘసభ్యులు తమ ఆస్తులపై దాడులుచేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. తమ కుటుంబాన్ని వెలివేసి దాదాపు మూడేండ్లు కావస్తున్నదని, గౌడ కులస్తులను ఎన్ని విధాలుగా బతిమిలాడినా, వేడుకున్నా కనికరం చూపడం లేదని, ఈ విషయమై గతంలో పోలీసులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేకపోయిందన్నారు.తమకు రూ.50 వేలు జరిమానా విధించగా..ఈనెల 23న ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మాచారెడ్డి గౌడ సంఘం ఆస్తిలో తమకు భాగస్వామ్యం ఇప్పించి న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నామన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

బీబీపేట్, సెప్టెంబర్ 27 : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి సతీశ్ యాదవ్ అన్నారు. బీబీపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్, ఎంపీవో కృష్ణ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధైర్యంగా పోరాడి విజయం సాధించాలి

మాచారెడ్డి, సెప్టెంబర్ 27 : విద్యార్థులు ధైర్యంగా పోరాడి విజయం సాధించాలని ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ స్పీకర్ రమేశ్ చైతన్య అన్నారు. మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు జీవితంలో లక్ష్యాలు, సవాళ్లు అనే అంశం పై శుక్రవారం అవగాహన కల్పించారు.

# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

కామారెడ్డి/బాన్సువాడ/బాన్సువాడ రూరల్/ నస్రుల్లాబాద్/ ఎల్లారెడ్డి రూరల్/ బిచ్కుంద/భిక్కనూరు, సెప్టెంబర్ 27 : జిల్లాలోని పలు మండలాల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో తనదైన పాత్ర పోషించి క్విట్ ఇండియ పోరాటం, గైర్ ముల్కి ఆందోళన చేసిన స్వాతంత్ర్య సమరయోధుడని అన్నారు.



కామారెడ్డిలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన కలెక్టర్



బాన్సువాడలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం..



కామారెడ్డిలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు

## ఎండు గంజాయి, రెండు బైక్‌లు స్వాధీనం

కామారెడ్డి, సెప్టెంబర్ 27 : కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి హన్మంత్‌రావు ఆదేశాల మేరకు శుక్రవారం సదాశివనగర్ మండలంలోని వజ్జెపల్లి గ్రామంలో సోదాలు నిర్వహించగా కామిండ్ల రాజశేఖర్ వద్ద 70 గ్రాముల ఎండు గంజాయి లభించిందని ఎక్సైజ్ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. అతనిని విచారించగా అతను యాచారం గ్రామానికి సంబంధించిన తిరుపతి వద్ద తీసుకున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి ఒక బైక్, 140 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌లో హాజరు పరిచామని తెలిపారు. ఈ దాడులో ఎస్సై విక్రమ్‌కుమార్, సిబ్బంది మైసరాజు, సంతోష్, రాధిక, ఆంజనేయులు, దేవకుమార్, రమ, శ్రీరాగ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

బాన్సువాడ రూరల్, సెప్టెంబర్ 27 : బాన్సువాడ మండలంలోని సోమేశ్వర్ గ్రామంలో తిమ్మప్పకు చెందిన ఇంట్లో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి రేకుల ఇల్లు దగ్ధమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మధ్యాహ్నం సమయంలో అకస్మాత్తుగా భారీ శబ్దంతో ఇంట్లో మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించగా, హుటాహుటీనా అక్కడి చేరుకొని మంటలు ఆర్పేశారు. ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో రోడ్డున పడ్డానని, ప్రభుత్వం ఆదుకొని న్యాయం చేయాలని బాధితుడు ప్రభుత్వాన్ని అధికారులకు విజ్ఞప్తి చేశాడు.

## నేడు లోక్ అదాలత్

కామారెడ్డి, సెప్టెంబర్ 27 : జిల్లా కేంద్రంలోని కోర్టులో శనివారం నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్‌రావు

మాచారెడ్డి, సెప్టెంబర్ 27 : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని జిల్లా పంచాయతీ అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా పాల్వంచ మండలంలోని ఏల్పుగొండ గ్రామంలో పర్యటించి పరిసరాలను పరిశీలించారు. అనంతరం మాచారెడ్డి పీహెచ్‌సీని సందర్శించి పారిశుద్ధ్య కార్మికులకు నిర్వహించిన వైద్యపరీక్షలను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపీబాబు, ఎంపీవో నాగరాజు, ఏపీవో సాయిబాబా పాల్గొన్నారు.

**మిర్జాపూర్‌లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం**

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 27 : నస్రుల్లాబాద్ మండలంలోని మిర్జాపూర్ గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాని, దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి వివరించారు. అనంతరం అంగన్‌వాడీ, ఆరోగ్య ఉపకేంద్రంలోని రిజిస్టర్లను ఎంపీవో సూర్యకాంత్ పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫిష్ పాండ్ నిర్వహణపై అవగాహన

రాజంపేట్/భిక్కనూరు, సెప్టెంబర్ 27 : రాజంపేట మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఫిష్ పాండ్ నిర్వహణపై లబ్ధిదారులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చేపల పెంపకం, బ్యాంక్ లోన్, సబ్సిడీ వివరాలను నాన్‌పామ్ డీపీఎం రమేశ్‌బాబు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశం, ఏపీఎం సాయిలు, సీసీలు వివోఏలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. భిక్కనూరు మండల సమాఖ్య ఆధ్వర్యంలో చేపల పెంపకంపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్ డీఎం రవికాంత్, ఎంపీడీ వో రాజ్‌కిరణ్‌రెడ్డి, డీపీఎం రమేశ్‌బాబు, ఉదయ్ ఆక్వ టెక్నికల్ సుధాకర్, జిల్లా మత్స్య శాఖ అధికారి రాజ రాం, టీజీబీ బ్యాంక్ మేనేజర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## పిచికారీ డ్రోన్‌ను తేవడం అభినందనీయం

నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 27 : పిచికారీ డ్రోన్‌ను అందుబాటులోకి తేవడం అభినందనీయమని తహసీల్దార్ భావయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సమీకృత మండల కార్యాలయ భవన సముదాయం ఆవరణలో ప్రయోగాత్మకంగా గడ్డి మందును పిచికారీ చేశారు.

## మున్సిపల్ చైర్‌పర్సన్ రెచ్చగొట్టడంతోనే.. 'జీవదాన్'పై దాడి

కామారెడ్డి, సెప్టెంబర్ 27 : జిల్లా కేంద్రంలోని జీవదాన్ పాఠశాలలో ఆరేండ్ల విద్యార్థినిపై వ్యాయామ ఉపాధ్యాయుడు లైంగికదాడి ఘటన విషయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చర్యలతోనే ఉద్రిక్తతకు దారి తీసిందని రాష్ట్ర ఆర్య క్షత్రీయ సంఘం అధ్యక్షుడు నిట్టు వేణుగోపాల్ రావు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థి, కుల సంఘాలు, పెద్దలు సామరస్యంగా సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తుండగా.. రాజకీయ లబ్ధికోసం తన వెంట వచ్చిన అనుచరులను రెచ్చగొట్టి రాళ్ల దాడికి ఉసిగొల్పారని పేర్కొన్నారు. జీవదాన్ స్కూల్‌లో జరిగిన ఘటన విషయంలో వీరిదే పూర్తి బాధ్యతని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చైర్‌పర్సన్ భర్త చంద్రశేఖర్‌రెడ్డి 15 రోజుల క్రితం భూకబ్జా కేసులో ప్రత్యక్షంగా ఉన్న ఎదుటి వర్గంపై రాజకీయ ఒత్తిడితో కేసు పెట్టించాడని ఆరోపించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కూడా ఈ విషయంలో జోక్యం చేసుకొని కామారెడ్డిలో వీరి ఆగడాలను ఆపకపోతే రాబోయే రోజుల్లో మత సామరస్యానికి ప్రతీక అయిన కామారెడ్డి బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తినే పరిస్థితులు ఏర్పడతాయని, స్పందించాలని కోరారు.

## 'మానవతా దృక్పథంతో వెళ్లాం'

కామారెడ్డి, సెప్టెంబర్ 27 : పట్టణంలోని జీవదాన్ పాఠశాలలో ఆరేండ్ల చిన్నారిపై లైంగిక దాడి ఘటన గురించి ఫోన్లో సమాచారం రావడంతో మానవతా దృక్పథంతో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కొందరు కౌన్సిలర్లతో కలిసి పాఠశాలకు వెళ్లినట్లు 16వ వార్డు కౌన్సిలర్ చాట్ల వంశీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి సంబంధం లేకున్నా కొంత మంది వాట్సప్ గ్రూప్‌లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారంపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## కుల వృత్తుల ఆర్థిక బలోపేతానికి కృషి

బాన్సువాడ, సెప్టెంబర్ 27 : కుల వృత్తులపై ఆధారపడి జీవించే వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నదని, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేలా కృషి చేస్తున్నదని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. బాన్సువాడలోని విశ్వ బ్రాహ్మణ మనుమయ యువజన సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్‌తో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ నార్ల సురేశ్ గుప్తా, బోడ భాస్కర్, మహ్మద్ ఎజాస్, కౌన్సిలర్లు హకీం, కమ్మరి గంగాధర్, మాజీ ఎంపీపీ బ్రహ్మం, పుండరీకం పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల అందజేత

బాన్సువాడ రూరల్, సెప్టెంబర్ 27 : బాన్సువాడ మండలంలోని చిన్నరాంపూర్ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ మారుతి సహకారంతో పరీక్ష ప్యాడ్లు, పెన్నులను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వీరప్ప, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నక్క ప్రవీణ్, గ్రామపెద్దలు పరిగే మోహన్‌రెడ్డి, గణేశ్, అంజయ్య, పరమేశ్, ఉపాధ్యాయులు వెంకటరమణ, నర్సింహరాజు తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడిగా సాయిలు

మాచారెడ్డి, సెప్టెంబర్ 27 : భారతీయ కిసాన్ సంఘ్ పాల్వంచ మండలం అధ్యక్షుడిగా తోట సాయిలు ఎన్నికయ్యారు. శుక్రవారం పాల్వంచలో కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గైని నగేశ్, సాయిలు, విఠల్‌రెడ్డి, సాయిరెడ్డి, మాధవరావు ఆధ్వర్యంలో పాల్వంచ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఏసురెడ్డి, ఉపాధ్యక్షుడిగా రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శుడిగా తిరుపతిరావు, సహాయ కార్యదర్శిగా నిత్యానంద్‌ను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు.

**రాజంపేట్ మండలం**

రాజంపేట్, సెప్టెంబర్ 27 : భారతీయ కిసాన్‌సంఘ్ రాజంపేట మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా శంకర్, సిద్ధరాములు, ప్రధాన కార్యదర్శిగా రాంచంద్రం, ముఖ్య సలహాదారులుగా రాంరెడ్డి, చిన్న యాదవరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా గంగారెడ్డి, బాల్‌రాజ్‌రెడ్డి, రాజు, వీరారెడ్డి, రమేశ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సంజీవరెడ్డిని ఎన్నుకున్నారు.

## ఈ నెల 30న ఉద్యోగ మేళా

కామారెడ్డి, సెప్టెంబర్ 27 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ నెల 30వ తేదీ సోమవారం జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాల టీఎస్‌కేసీ విభాగంలో లేదా బ్యాంకు ప్రతినిధి కుమార్ 8106764653ను సంప్రదించాలని తెలిపారు.

## పెరటి కోళ్ల పెంపకం యూనిట్ ప్రారంభం

గాంధారి, సెప్టెంబర్ 27: మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా మండలంలోని జువ్వాడి గ్రామ మహిళా సంఘం సభ్యురాలు వడ్ల లక్ష్మికి పెరటి కోళ్ల పెంపకం యూనిట్ మంజూరైంది. ఈ యూనిట్‌ను ఎంపీడీవో రాజేశ్వర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘం సభ్యులు స్వశక్తితో అభివృద్ధి చెందడం కోసం ప్రభుత్వం పెరటి కోళ్ల పెంపకం యూనిట్లను మంజూరు చేస్తున్నదని చెప్పారు. దీంట్లో భాగంగా 1200 కోడి పిల్లలను అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మీనారాయణ, ఏపీఎంలు గంగరాజు, రాజేందర్, పంచాయతీ కార్యదర్శి అరుణ్, సీసీలు రాజు, కాంత్‌రెడ్డితోపాటు పలు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



పెరటి కోళ్ల యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీవో రాజేశ్వర్

## పీఎస్‌పై దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు

రామారెడ్డి, సెప్టెబర్ 27: రామారెడ్డి పోలీస్ స్టేషన్‌పై దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డికి చెందిన బిట్ల రవి గురువారం రాత్రి జమ్మేదార్ రాజనర్సయ్యతోపాటు పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశాడన్నారు. తప్పించుకున్న అతడిపై జమ్మేదార్ రాజనర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## సెల్‌ఫోన్ అందజేత

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 27: ఎల్లారెడ్డికి చెందిన గొడ్డన్ల రామకృష్ణ ఈనెల 10వ తేదీన తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. పూర్తి వివరాలతో ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. దీంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీ కనుగొని స్వాధీనం చేసుకున్నారు. దానిని రామకృష్ణకు శుక్రవారం అందజేశారు.

## శతాధిక వృద్ధురాలు మృతి



భూమవ్వ(ఫైల్)

లింగంపేట(తాడ్వాయి), సెప్టెంబర్ 27: తాడ్వాయి మండలంలోని ఎండ్రియాల్ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు గడ్డం భూమవ్వ(119) శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం ఉదయం వ్యక్తిగత పనులు చేసుకున్న భూమవ్వ అకస్మాత్తుగా మరణించిందని అన్నారు. భూమవ్వకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు సంతానం అని, మొత్తం కుటుంబ 35 మంది కుటుంబ సభ్యులు ఉన్నారని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో నిర్వహించిన ఆమె అంత్యక్రియల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి ఏఎంసీ అభివృద్ధికి నిధులు ఇస్తాం..

- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు
- కొలువుదీరిన ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 27: ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డి ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. చైర్‌పర్సన్‌గా రజితా వెంకట్రాంరెడ్డి, వైస్ చైర్మన్‌గా రాజు, డైరెక్టర్లుగా హరినారాయణ, శ్రీనివాస్, శంకరయ్య, పోల్‌సింగ్, గోపాల్, నాగేశ్వర్, నగేశ్, అజీమ్, లక్ష్మీనారాయణ, గంగారెడ్డి, లక్ష్మణ్, రవీందర్‌రెడ్డితో మార్కెట్ కమిటీ జిల్లా అధికారిణి రమ్యశ్రీ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన పాలకవర్గం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలువాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పదవులు లభిస్తాయని, తనవద్ద పైరవీలకు తావులేదన్నారు. అనంతరం జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అన్నారు. ఇచ్చిన హామీల్లో సగం అమలు చేశామని, మిగితావి త్వరలోనే అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నతస్థాయిలో స్థిరపడాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో ప్రభాకర్

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 27: విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతస్థాయిలో స్థిరపడాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ సూచించారు. పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల పాఠశాలలను ఆయన మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజుతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. దసరా సెలవుల్లో కూడా ప్రణాళికతో చదువుకోవాలన్నారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు మామిడి రమేశ్, కృష్ణమూర్తి, చిరంజీవులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు బీమా పత్రాల అందజేత

మద్నూర్, సెప్టెంబర్ 27: మండలకేంద్రంలో పనిచేసే పంచాయతీ కార్మికులకు డీఎల్పీవో నాగరాజు శుక్రవారం బీమా పత్రాలను అందజేశారు. స్వచ్ఛతాహీసేవా కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు హెల్త్ చెకప్‌తో పాటు బీమా చేయించినట్లు తెలిపారు. ఎంపీడీవో రాణి, ఎంపీవో వెంకటనర్సయ్య, కార్యదర్శి సందీప్‌కుమార్, డాక్టర్ నాగార్జున పాల్గొన్నారు.

## తాగునీటి సహాయకులకు శిక్షణ

ఎల్లారెడ్డి రూరల్/నస్రుల్లాబాద్, సెప్టెంబర్ 27: గ్రామాల్లోని తాగునీటి సహాయకులకు ఆజామాబాద్‌లో శుక్రవారం శిక్షణా శిబిరాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. హ్యాండ్ పంప్ మరమ్మతులు, సింగిల్, త్రీ ఫేజ్ మోటర్లకు రిపేర్, ప్యానల్ బోర్డుల నిర్వహణ, పైప్‌లైన్ లీకేజీలు అరికట్టే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రవీణ్‌రెడ్డి, డీఎల్పీవో సురేందర్, ఎంపీడీవో లక్ష్మి, ఎంపీవో ప్రకాశ్, అన్నాసాగర్, పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు. బీర్కూర్ మండలం రైతునగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఎస్ఈ రాజేంద్రకుమార్, డీఈ వెంకటేశ్, ఏడీఏ అనిల్, ఎంపీడీవో పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఉపాధి పనులను గుర్తించాలి




సమావేశంలో మాట్లాడుతున్న నిజాంసాగర్ మండల ప్రత్యేకాధికారి తిరుపల ప్రసాద్

నిజాంసాగర్, సెప్టెంబర్ 27: గ్రామాల్లో ఉపాధి హామీ పనులను గుర్తించాలని మండల ప్రత్యేకాధికారి తిరుమల ప్రసాద్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులపై ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని ఆదేశించారు.

## ఎయిడ్స్ వ్యాధి నివారణపై కళా ప్రదర్శన

లింగంపేట, సెప్టెంబర్27: ఎయిడ్స్ వ్యాధి నివారణపై మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో శుక్రవారం కళా ప్రదర్శన నిర్వహించారు. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో కళా ప్రదర్శనలు ఇస్తున్నామని బృందం సభ్యులు తెలిపారు. ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, నివారణ చర్యలపై ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు సవిత, సంతోష్, నవీన్, శ్రీరాం, ప్రశాంత్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

## సమయానికి స్టాక్ పంపించాలి



ఎంఎల్ఎస్ పాయింట్‌ను పరిశీలిస్తున్న సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ రాజేందర్

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్ 27: సమయానికి రేషన్ దుకాణాలకు బియ్యం పంపిణీ చేయాలని సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ రాజేందర్ సూచించారు. ఎల్లారెడ్డిలోని మండల్ లెవెల్ స్టాక్ పాయింట్‌ను టెక్నికల్ అసిస్టెంట్ అప్పారావుతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎంఎల్ఎస్ పాయింట్ డీటీ బాలయ్యతో మాట్లాడారు. స్టాక్ వివరాలను పరిశీలించారు. రేషన్ డీలర్లు ఆయనతో మాట్లాడారు. సెప్టెంబర్ నెలకు వచ్చిన బియ్యం బాగా లేవని, వాటిని తీసుకొని మంచి బియ్యం ఇవ్వాలని కోరారు. స్పందించిన జిల్లా మేనేజర్ మంచి బియ్యం ఇవ్వాలని ఆదేశించారు. ఆయనతో పాటు సివిల్ సప్లయీస్ ఎల్లారెడ్డి డీటీ సురేశ్, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగం సురేందర్, రేషన్ డీలర్లు డీవీ శివ, మామిడి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

బిచ్కుంద, సెప్టెంబర్ 27: మండలంలోని బండారెంజల్ గ్రామంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు శుక్రవారం క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగుచేస్తున్న వరిని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు అనిల్‌రెడ్డి, రేవంత్‌తోపాటు ఏవో రాజలింగం పరిశీలించారు. పంటకు ఎండాకు తెగులు సోకినట్లు గుర్తించి, నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు దయానంద్, సాయికిశోర్, లక్ష్మణ్, భాను, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిజాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

నిజాంసాగర్, సెప్టెంబర్ 27: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం 21,500క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుందని ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు. దీంతో ప్రాజెక్టు మూడు గేట్లను ఎత్తి దిగువకు 24,500క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 1405.00 అడుగుల (17.802టీఎంసీల)కు ప్రస్తుతం 1404.98 అడుగుల (17.773టీఎంసీల) నీరు నిల్వ ఉన్నదని తెలిపారు.

## నేటి నుంచి శనగ విత్తనాల పంపిణీ

రామారెడ్డి, సెప్టెంబర్ 27: సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి, పద్మాజివాడి, ఉత్తునూర్, సదాశివనగర్ ప్రాథమిక సహకార సంఘాల్లో నేటి(శనివారం) నుంచి శనగ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు ఏవో ప్రజాపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పోచారం ప్రాజెక్టు వద్ద ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 27: మండలంలోని పోచారంప్రాజెక్టు అతిథి గృహం వద్ద పర్యాటకులు పాడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను మండల ప్రత్యేకాధికారిణి ప్రసన్నలక్ష్మి, ఎంపీడీవో ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం తొలగించారు. ప్రాజెక్టు పరిసరాల్లో ప్లాస్టిక్ కవర్లు, వాటర్, కూల్‌డ్రింక్ బాటిళ్లను వేయడంతో అపరిశుభ్రంగా మారుతున్నాయని అన్నారు. దీంతో పంచాయతీ సిబ్బందితో మొత్తం శుభ్రం చేయించామని తెలిపారు. కార్యక్రమంలో పోచారం గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుపతి, ఈజీఎస్ ఎఫ్ఏ స్వప్న తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న కార్మికులు

## నల్లబ్యాడ్జీలు ధరించి వైద్య సిబ్బంది నిరసన



నిరసన వ్యక్తంచేస్తున్న వైద్యసిబ్బంది

రామారెడ్డి, సెప్టెంబర్ 27: జుక్కల్ సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విఠల్‌కు మెమో జారీ చేయడాన్ని నిరసిస్తూ అన్నారం, రామారెడ్డి పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్య సిబ్బంది శనివారం నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఇటీవల బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి జుక్కల్ సీహెచ్‌సీని సందర్శించిప్పుడు మెడికల్ ఆఫీసర్ విఠల్ డ్రెస్సింగ్, సెగ్రిగేషన్ సరిగా లేదని తహసీల్దార్ మెమో జారీచేశారు. దీంతో మెమోను ఉపసంహరించుకోవాలని కోరుతూ వైద్య సిబ్బంది నిరసన వ్యక్తంచేశారు.

## జెండాకు ప్రత్యేక పూజలు



పాల్గొన్న భక్తులు

మద్నూర్, సెప్టెంబర్ 27: మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో ప్రతిష్ఠించిన బాలాజీ జెండా వద్ద భక్తులు శుక్రవారం పత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నాగిరెడ్డిపేట/ నిజాంసాగర్, సెప్టెంబర్ 27: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నాగిరెడ్డిపేట మండల ప్రత్యేకాధికారిణి ప్రసన్నలక్ష్మి ప్రజలకు సూచించారు. మండలంలోని కన్నారెడ్డి గ్రామాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో చేపడుతున్న పనులను పరిశీలించారు. అనంతరం పాఠశాలను సందర్శించి, రికార్డులు, విద్యార్థుల హాజరుపట్టికలను తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలను హెచ్ఎం సంధ్య.. ప్రత్యేకాధికారిణి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమెతోపాటు పంచాయతీ కార్యదర్శి రమేశ్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. నిజాంసాగర్ మండలంలోని సుల్తాన్‌నగర్ గ్రామాన్ని ఎంపీడీవో గంగాధర్ సందర్శించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి బాలింతలు, చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తకు సూచించారు.